శ్రీకాకుళం

# మూడు గోడల గది

"కట్టె, కొట్టె, తెచ్చె". ఇందులో రామాయణ మంతా ఇమిడి ఉందట. ఒక మూడు మాటల్లో రామాయణ గాధ గర్భితమై ఉండడం, వెంకటరావుకి ఆశ్చర్యాన్ని కలిగించింది. తన జీవిత గాధని, ఈ విధంగానే, తాను ఒక మూడు మాటల్లో ఇమడ్చ గలిగి ఉంటే, ఎంత బాగుండేది. వెంకట్రావు ఆలోచించటం మొదలెట్టాడు. అతని కళ్ళ ముందు భయంకరంగా, అతని ఇల్లు నిలిచింది. నిముష నిముషానికీ అది విస్తృతపడి, తననీ, తన భార్యనీ, తన పిల్లల్నీ మింగేస్తున్నట్లు కనపడింది. దాని పెదవులు భూమ్యాకాశాన్ని అంటుకుంటున్నాయి. ఆ భూతాన్ని చూడడంతోనే, వెంకటరావు శరీరం కంపర మెత్తింది. తన శరీరాన్నీ ఆత్మనీ నమిలి పిప్పి చేసి తనని కబళించి వేయడానికి ప్రయత్నిస్తున్నది. వట్టింట్లో తన చితి భగ భగ మండుతున్నది. ఉద్రేకాలు, ఆవేదనలు, ఆశయాలు, అనంతముఖాలు గల ఆ అగ్నిశిఖల్లో ఫెటిల్లని విరిగి, చుంయి చుంయి మంటున్నాయి. వెంకటరావుకి ఎందుకో తన మెదడులో సీసం కరిగించి పోసినట్ల యింది. ఈ మారణహోమం కోసమేనా, మనుషులు తనకి మల్లేనే "ఇల్లు — నా ఇల్లు" అని యమయాతనలు పడడం, జీవితాంతం శరీరాలే యంత్రాలుగా పని చేయడం? కష్టపడడం? చివరికి ఆ యంత్రాల పండ్లల్లో తమ తమ కుటుంబాలతోసహా నలిగి, గిలగిల తన్నుకోవడం. ఉవ్వెత్తున

లేచిన ఆ ఆవేశానికి వెంకటరావు శరీరం ముచ్చెమటలు పోసింది. మెదడు పని చేయడం మానుకుంది. గొడ్డలితో నరికినా చీల్చడానికి శక్యం గాని నిశ్శబ్దం ఏర్పడింది. ఆ నిగూఢ నిశ్శబ్దంలో వెంకటరావు ఉక్కిరి బిక్కిరి అయినాడు. గాలి ఆడటం లేదు. ఎవరో ఎందుకో తన గొంతు నులిమి వేస్తున్నట్లు అతనికి తోచింది. ఆ బాధని భరించలేక, గొంతు చుట్టూ తన చేతుల్ని పోనిచ్చి, నెమ్మదిగా రాచి, కొంత వరకు తన ఆయాసాన్ని ఉపశమింప చేసుకున్నాడు. ఇంక ఇంట్లో అట్టే కాలం నిలువడం, ఆత్మహత్యగా పరిణమిస్తుందేమోనని భయపడి కుర్చీలో నించి లేచాడు. పరిసరాలు కనపడకుండా గట్టిగా కళ్ళు మూసుకొని, పూర్వ జ్ఞాపకాలు ఆధారంగా బయటికి వచ్చి పడ్డాడు. కాళ్ళు రోడ్డు మీద పడ్డాయి; ముందుకు సాగుతున్నాయి.

"కట్టె, కొట్టె, తెచ్చె" మళ్ళీ ఆ మాటలు అతని చెవుల్లో గింగురుమంటున్నాయి. చెవుల పొరల్ని తెగగొట్టి వాటిల్లో నిశ్శబ్దపు గూళ్ళని కట్టుతున్నాయి. మళ్ళీ అతని మెదడు, అతని జీవితాన్ని ఒక మూడు మాటల్లో యిమడ్చడానికి ప్రయత్నిస్తున్నది. ఇల్లు, మొదటిమాట ఇదివరకే దొరికిందని వెంకటరావుకి చప్పున స్ఫురణకి వచ్చింది. రెండవ మాటకోసం మెదడు అతని శబ్దకోశాన్ని తరచి చూస్తున్నది. జ్ఞాపకాల మడతల్ని ఒక్కొక్కటిగా తీసి పక్కకు గిరాటు వేస్తున్నది. సంఘటనలు మట్టిబెడ్డలకుమల్లే దొర్లిపోతున్నాయి. చిన్నతనం ఒక మట్టిబెడ్డ. ఆ మట్టిబెడ్డతో తన తలిదండ్రులు, ఆడుకున్నారు. ముచ్చటతీర్చుకున్నారు. వెంకటరావుకి, తన కుగ్రామం, మొండిగోడలు, మోళ్ళు, రోగగ్రస్థమైన పశువులు

అజ్ఞానంతో బండబారిన మనుషులు కనబడ్డారు. మోళ్ళు చిగురించవు—మనుషులు మనుషులు కాలేరు. జరామరణాలతో నశించిపోతారు. అంతే బెడ్డ దొర్లిపడింది. రెండవబెడ్డ కదలడానికి ప్రాణం పోసుకుంటున్నది. కదలికతో తన రూపాన్ని మార్చుకుంటున్నది. చదువు, యవ్వనం—పల్లెటూరు బస్తీగా మారింది. వీధిబడి, కళాశాలగా రూపొందింది. స్థలంతో, కాలంతో అభిరుచులు మారుతున్నాయి.

ఉద్రేకోద్వేగాలు బహుముఖాలుగా పరవళ్ళు త్రొక్కుతున్నాయి. ఆశలు, ఆశయాలు క్రమంగా రేకెత్తుతున్నాయి. దృష్టి విశాలమై ప్రపంచాన్నే బంధించి వేస్తున్నది. శరీరం క్రొత్తబలాన్ని పోసుకొని, ప్రపంచంమీద స్వారీచేస్తున్నది. యవ్వన ప్రాదుర్భావం, అనంతవిశ్వాన్ని ఒకచోటికి కుదిస్తున్నది. విశ్వాత్మలో, హృదయం నిశ్వసిస్తున్నది. ఇంకొక బెడ్డ వివాహం — పచ్చపచ్చగా వొయ్యారంగా కదిలిపోయింది. ఉద్యోగం — ఇది ఇంకొక బెడ్డ బలంగా వుంది. కదలడంలేదు. స్థాణువుగా నిలుచున్నది. వెంకటరావుకి ఎందుకో జీవితం ఆగిపోయినట్లు కనపడింది. ఎందుకో అతనికి తన ఆఫీసులోని ప్రాణంలేని బల్లలూ, కుర్చీలు జ్ఞాపక మొచ్చాయి. "ప్రతి మనిషీ ఒక దశలో, ఆఫీసులో పని చేయక తప్పదా?" అనే ఆలోచన కలిగింది.

మృత్యువుని తప్పించుకోలేము. మానవ మాత్రుడికి అది సాధ్యంకాదు. ఆఫీసుకూడా అంతేనా? గానుగెద్దు జీవితం. ఇల్లు, ఆఫీసు, ఇల్లు. ఆఫీసు. ఈ రెండు మాటలు, పెనుభూతాలలాగా వెంటబడ్డాయి. ఇల్లు, ఆఫీసు, ముందూ

వెనకల నిల్చి జీవితం పీక నొక్కేస్తున్నాయి. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్‌లు జీవితాన్ని చూచి వెకిలిగా నవ్వుతున్నాయి. కొత్త అనుభవాల్ని, ఆశయాల్ని, దూరదూరం చేస్తున్నాయి.

ఇల్లు, ఆఫీసు, డబ్బు, భార్యా పిల్లలు.'' ''మనిషి ఈ వలయంలో పడి గిజగిజ తన్నుకోవలసిందేనా?'' ఈ ప్రశ్న వెంకటరావు కళ్ళముందు ఉవ్వెత్తున లేచింది. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్‌లు, యింకా, యింకా వెకిలిగా నవ్వుతూనే ఉన్నాయి. వెంకటరావుకి తన గానుగెద్దు జీవితంపైన రోత కలిగింది. కాళ్ళు, నడకే పనిగా ముందుకు వెడుతున్నాయి. అవి బొబ్బలెక్కడంలేదు. చాలీచాలని డబ్బు, అవయవాల్ని సక్రమంగా పనిచేయిస్తూనే వుందని తెలిసి, వెంకటరావు హృదయానికి కొంత సంతృప్తి కలిగింది. వెంటనే అవయవాలు లేకపోతే ఎట్లావుంటుందనే ఆలోచన అతని బుర్రలో గిర్రున తిరిగింది. ఏముంది, జీవితం ఆగిపోతుందనే సమాధానంవచ్చింది. ఈ గానుగెద్దు జీవితానికన్నా జీవితం ఆగిపోవడమే మంచిదని తోచింది. కాళ్ళూ చేతులు విరగ్గొట్టుకుంటే? భార్యా పిల్లలూ, రోడ్డులో పడతారు—గడపగడపకీ ముష్టి ఎత్తుకుంటారు—కుష్టు రోగంతో, చివరికి కుళ్ళిచస్తారు. వెంకటరావుకి హోటళ్ళ ప్రక్కని అడుక్కుతినే కుష్టురోగులు జ్ఞాపకమొచ్చారు. లక్ష చేతులతో, లక్ష నోళ్ళతో దేశంలో వెలసిన పెద్దఅమ్మవారు, ఇనుపగజ్జెల తల్లి, చప్పున కళ్ళముందు ప్రత్యక్షమైంది. ఇనుపగజ్జెలు, అనంతార్తనాదాలు, ఇల్లు, ఆఫీసు అనే మాటల్ని ప్రపంచమంతటా ప్రతిధ్వనింప జేస్తున్నాయి.

వెంకటరావుకి ఈ ప్రతిధ్వనులతో నిలుచున్న పాటున పిచ్చెత్తింది. మేకులకు మల్లే ఒకటే పనిగా మెదడుని గుచ్చు కుంటున్న భావాల్ని తప్పించుకోవడానికి, వడివడిగా నడవడం మొదలెట్టాడు. భావశరాలు, ఇంకా తరుముకొని వస్తూనే ఉన్నాయి. పరుగెడితే? అవును శరీరం అలసి పోతుంది. మెదడు పని చేయడం మానుకుంటుంది. వెంకటరావు పరు గెత్తడం మొదలెట్టాడు. వేగంగా, ఇంకా వేగంగా. వెంకట రావుకి ప్రజలు తనను ఒకటే పనిగా, చూస్తున్నారనే ధ్యాస, పరుగులో ఎగిరి పోయింది. పరుగే అస్తిత్వంగా మారింది. మనుషులూ, ఎలెక్ట్రిక్ స్తంభాలు, మిద్దెలు, మేడలూ, రిక్షాలు, టాంగాలు వెనక్కి పరుగు తీస్తున్నాయి. వేగంతో పోటీ పడుతూ అతను ముందుకు పోతున్నాడు.

వెంకటరావు ఆయాసంతో ఒక ఇంటిముందు చతికిల బడ్డాడు. ఇంటి అరుగు విశాలంగానే ఉంది. చెమటకి కోటు చంకలు తడిసాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆయాసంగా వస్తు న్నాయి. ఛాతీ పైకి లేచి, కెరటంలా కింద పడుతున్నది. నిముషం. రెండు. మూడు. నాలుగు. జీవితమే ఒక పరుగుగా మార్చుకుంటే? దేనికోసమనే సందేహం కలిగింది. మళ్ళీ భావాలు, పేలకు మల్లే మెదడుని తొలుస్తున్నాయి. ఇల్లు... ఆఫీసు...ఇల్లు...ఆఫీసు...అనే రొద వినిపిస్తున్నది. మూడవ మాట ఇంకా దొరకలేదు. దొరికితే ఎంత బాగుంటుంది. శబ్దకోశం పుటలు మళ్ళీ ఒక్కొక్కటిగా తిరిగాయి. ఊహు ఏమీ లాభం లేదు — ఎంతకీ మూడవ మాట స్ఫురించటం లేదు. తిరిగి ఆలోచనకి ఉపక్రమించాడు. ఒకటే ఆలోచన...

అంతూ పొంతూ లేని ఆలోచన ... ఇంతలోకే ఒక కూలి మనిషి, పెద్ద బియ్యం బస్తా మోస్తూ ఎడమనుంచి కుడివేపుకి వెళ్ళాడు. రోడ్డు పైన, రిక్షాలు, కార్లూ నడుస్తూనే ఉన్నాయి. వెంకటరావు మెదడులో చప్పున "చాకిరి" అనే మాట భయంకరాకృతితో ఆకాశంఎత్తున కళ్ళముందునిలిచింది. ఇల్లు, ఆఫీసు, చాకిరీ, ఈ మూడు మాటల్లో తన జీవితగాథ ఇమిడి ఉందనిపించింది. ఇల్లూ, ఆఫీసూ, చాకిరీ, ఈ మూడు మాటలు దెయ్యాల లాగా తన చుట్టూ తిరుగుతున్నట్టు వెంకటరావుకి తోచింది. ఈ మాటలు తన జీవితం చుట్టూ ఎన్నో వలయాలను గిర్రున త్రిప్పుతున్నాయి. అన్నింటి కంటె దగ్గరగా వున్న వలయం క్షణక్షణానికి బిగుసుకొంటున్నది. ఒక రోజు తనని నొక్కి నులిమివేస్తుంది. వెంకటరావు బస్సు పై అంతస్థు నుంచి నగరాన్ని కలయ జూచినట్లు, తన జీవితాన్ని తరిచి చూచుకున్నాడు. అతనికి, తన జీవితం బట్టబయలై కనపడింది. మూడు మాటల్లో అతని జీవితం ఇమిడింది. ఇల్లూ ... ఆఫీసు...చాకిరీ...ఇల్లూ...ఆఫీసూ...చాకిరీ...

వెంకటరావు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చెంపల మీదుగా కారి చొక్కాపైన పడ్డాయి. కన్నీళ్ళు ఎంతకీ ఆగలేదు. కళ్ళల్లో నీళ్ళు చెలమల్లో వూరినట్లు ఊరుతున్నాయి. నిముషం. రెండు, మూడు, నాలుగు. పది నిముషాలు గడిచాయి. తన చొక్కాతోనే వెంకటరావు తన కళ్ళు తుడుచుకున్నాడు. తనని తానే ఓదార్చుకున్నాడు. అరుగుమీదినించి

నెమ్మదిగా లేచాడు. రొటీన్‌కి అలవాటుపడ్డ కాళ్లు ఇంటివేపు దారితీసాయి. వెంకటరావుని ఇంటికి ఈడ్చాయి. ఇంట్లో భార్య క్షయతో మంచంలో మూలుగుతూనే వుంది. పిల్లలిద్దరూ మంచం దగ్గర గచ్చకాయలు ఆడుకుంటున్నారు. భార్యకి మందులు తేలేని లేమి, ఒకనాటి సాయంత్రం వెంకటరావులో తుఫాను రేపి మనిషిని ఒక ఊపు ఊపింది.

సాయంత్రానికల్లా, తుఫాను ఆగిపోయింది. మరుసటి రోజున తిరిగి వెంకటరావు ఇల్లూ, ఆఫీసూ, చాకిరీ, అనే రొటీన్‌లో లీనమైనాడు.

★